సాక్షి ఒడిశా

గురువారం । 16 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,92,206లు, బంగారం 1 గ్రాము 800 మిల్లీ గ్రాములు, వెండి 272 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



పరిహారం చెల్లించాలని డిమాండ్

రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ఉపాధ్యాయుడు, ఎన్నికల ప్రొసీడింగ్ అధికారి ఇంద్రజిత్ కిర్సనీ కుటుంబానికి పరిహారం చెల్లించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు.

- 10లో



అంగన్‌వాడీ వర్కర్‌ను హత్య చేస్తానని బెదిరింపు

బాల్య వివాహాన్ని అడ్డుకున్న తనను హత్య చేస్తామని ఒక యువకుడు బెదిరించాడని అంగన్‌వాడీ వర్కర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

- 10లో

న్యూస్‌రీల్

మాజీ మంత్రి డొంబురుధర్ ఉలక కన్నుమూత



రాయగడ: మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డొంబురుధర్ ఉలక (87) మంగళవారం రాత్రి భువనేశ్వర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈయన కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. జిల్లాలోని బిసంకటక్ శాసనసభ నియోజకవర్గం నుంచి 1974, 1977, 1995, 2004, 2009లో వరుసగా విజయం సాధించారు. ఒకసారి రాష్ట్ర అటవీ శాఖ మంత్రిగా సేవలు అందించారు. ఈయనకు ముగ్గురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మూడో కొడుకు నీలమాధవ ఉలక బిసంకటక్ శాసనసభ నియోజకవర్గం నుంచి ఈ సార్వత్రిక ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. డొంబురు మృతిపై పలువురు తమ సంతాపాన్ని ప్రకటించారు.

డొంబురుధర్ ఉలక మృతికి సంతాపం

పర్లాకిమిడి: మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డొంబురుధర్ ఉలక మృతికి గజపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే దాశరథి గోమాంగో, బిజయ పట్నాయక్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బసంత పండా సంతాపం తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



ప్రమాదస్థలంలో గాయాలతో జనార్దన్

రాయగడ: జిల్లాలోని కొలనార సమితి కర్లకొన గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో జనార్దన్ పట్నాయక్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్నికల విధులను నిర్వహించేందుకు గుణుపూర్ వెళ్లిన ఆయన, విధుల అనంతరం తిరిగి తన స్వగ్రామమైన రామనగుడకు మంగళవారం బైక్‌పై బయల్దేరాడు. ఈ క్రమంలో కర్లకొన గ్రామ సమీపంలో బైకు అదుపుతప్పడంతో కిందపడిపోయాడు. దీంతో తీవ్రగాయాలకు గురైన అతడిని అక్కడివారు కొలనార ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం బరంపురం తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



శివానీ సింగ్(ఫైల్)

కొరాపుట్/మల్కన్‌గిరి: అనుమానాస్పద స్థితిలో నవ వధువు అగ్నికి ఆహుతైన విషాదకర ఘటన కొరాపుట్ జిల్లాలో జరిగింది. మల్కన్‌గిరి జిల్లా బెంగాలి క్యాంప్ ఎంపీ-10కి చెందిన గగన్ మండల్ కుమార్తె శివాని సింగ్(21)ని పుజారిపుట్ గ్రామానికి చెందిన చెందిన ప్రభాస్‌సింగ్‌తో ఈ ఏడాది మార్చి 12న వివాహం జరిగింది. కొద్దిరోజులయ్యాక అత్తారింట్లో వరకట్న వేధింపులు మొదలయ్యాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి బెంగాలి క్యాంపులోని తన నివాసంలో శివాని అనుమానాస్పద స్థితిలో మంటలు అంటుకున్నాయి. వెంటనే ఆశా కిరణ్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందింది. వరకట్నం వేధింపులు వల్లే తమ కుమార్తె చనిపోయిందని బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ప్రభాస్‌సింగ్‌ను అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



మినీ ట్రక్‌ను ఢీకొన్న బైకు



గాయపడిన అలాం

రాయగడ: జిల్లాలోని కోమట్లపేట సమీపంలో బుధవారం బైక్, మినీ ట్రక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక కస్తూరీనగర్ రెండో లైన్‌లో నివాసముంటున్న సహజాద్ అలాం వెల్డింగ్ పనులు చేసుకుని జీవనోపాధి పొందుతున్నాడు. బుధవారం ఉదయం జేకేపూర్‌లోని ఒక ఇంట్లో వెల్డింగ్ పనులు చేసేందుకు బయలుదేరాడు. కోమట్లపేట వచ్చే సరికి ఆవు అడ్డంగా రావడంతో తప్పించబోయే క్రమంలో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మినీ ట్రక్‌ను బలంగా ఢీకొన్నాడు. తీవ్ర గాయాలపాలైన అలాంను చందిలి పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ధ్వంసమైన పాఠశాల గార్డెన్



కకావికలమైన పాఠశాల స్టోర్స్ రూం



కూలిన చెట్లను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం



దెబ్బతిన్న తరగతి గది

ఈదురుగాలుల.. బీభత్సం

జయపురం పట్టణాన్ని ఈదురుగాలులు వణికించాయి. కాలవైశాఖి నేపథ్యంలో మంగళవారం సాయంత్రం గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్లు, కార్యాలయాలు ధ్వంసమయ్యాయి. హోర్డింగులు, ఇళ్ల పైకప్పులు గాలుల ధాటికి ఎగిరిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నెహ్రూనగర్‌లో మోకాలిలోతు నీరు ప్రవహించడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో సరఫరా లేక అంధకారంలో మగ్గిపోయారు. బుధవారం ఉదయం మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ సిబ్బందితో చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రోడ్లపై పడిన హోర్డింగ్‌లు, చెట్ల కొమ్మలు తొలగించారు.

– జయపురం



రహదారిపై కూలిన చెట్టు



జలమయమైన రహదారి



కూలిన చెట్టు



నేలకొరిగిన చెట్లు



కార్యాలయంలో పైకప్పు ఎగిరిపోయిన దృశ్యం

దోపిడీ దొంగల హల్‌చల్



సంఘటన స్థలంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు



దోపిడీ దొంగలు చిందరవందర చేసిన దృశ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా బీజేడి నాయకుడు సునీల్ సాహు లక్ష్యంగా దోపిడీ దొంగలు హల్‌చల్ చేశారు. బుధవారం వేకువజామున అతని స్వగ్రామం డొంగ్రుబజలో ఉన్న ఇంటిపై తుపాకీలతో దాడులకు తెగబడ్డారు. ఇంటి తలుపులు విరగ్గొడుతూ చొరబడ్డారు. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో బీరువాలు పగలుగొట్టి ఫైల్స్ చిందరవందరగా పడివేశారు. అదే ఇంటిలో వేరే పోర్షన్‌లో అద్దెకు ఉంటున్న రోహిత్ బెహరా ఇంట్లోకి చొరబడ్డారు. ఆ ఇంట్లో పిల్లల తలపై తుపాకులు గురిపెట్టి సునీల్ కోసం వాకబు చేశారు. అయితే సునీల్ నబరంగ్‌పూర్ పట్టణంలో ఉన్నారని, తాము అద్దెకు ఉంటున్నామని ఆ కుటుంబీకులు తెలియజేశారు. అనంతరం వారి ఇంట్లో బీరువాలు తనిఖీ చేసి సుమారు రూ.7 లక్షలు విలువ చేసే నగలు అపహరించుకుపోయారు. ఉదయం వరకు భయంతో రోహిత్ కుటుంబీకులు ఇంట్లోనే ఉండిపోయారు. అనంతరం గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. నబరంగ్‌పూర్ ఐజీసీ సంబిత్ బెహరా నేతృత్వంలో బలగాలు సంఘటన స్థలానికి చేరుకున్నాయి. సునీల్ సాహు సైతం స్వగ్రామానికి చేరుకున్నారు.

దర్యాప్తు ప్రారంభం

ఏడుగురు దొంగల దాడిలో పాల్గొన్నారని పోలీసులు గుర్తించారు. పోలీసు జాగిలాలను తెప్పించి దర్యాప్తు చేస్తున్నారు. సునీల్ సాహుకి పట్టణంలో రాకీ సాన్ పేరుతో హోటల్, ఫంక్షన్ హాల్, అనేక వ్యాపారాలు ఉన్నాయి. గతంలో ఒకసారి దోపిడి దొంగలు సునీల్‌ని అపహరించుకుపోయారు. సుమారు నెల రోజులు తమ ఆధీనంలో ఉంచుకున్నారు. అతని కుటుంబ సభ్యులు దొంగలతో చర్చలు జరిపి విడిపించుకున్నారు. అనంతరం ప్రభుత్వం సునీల్‌కి గన్‌మెన్‌ను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో సునీల్ సాహు అధికార పార్టీకి ఆర్థికంగా కీలకంగా వ్యవహరించారు. 13వ తేదీ రాత్రి వరకు సునీల్ స్వగ్రామంలోనే ఉంటూ ఎన్నికలు పర్యవేక్షించారు. అతనిపై దాడిచేస్తే పెద్ద ఎత్తున లబ్ధి పొందవచ్చుననే ఉద్దేశంతో ఈ దాడి జరిగిందనే ఊహాగానాలు జరుగుతున్నాయి. కానీ సునీల్ తన మకాం నబరంగ్‌పూర్‌కి మార్చడంతో దొంగల అంచనా తప్పింది.

మో బూత్ యాప్ ఆవిష్కరణ



యాప్ ఆవిష్కరించిన సీఈఓ నికుంజ బిహారి ధొలొతో ఇతర ఉన్నతాధికారులు

భువనేశ్వర్: ఓటింగ్ ప్రక్రియ క్రమబద్ధీకరణ నేపథ్యంలో ఖుర్దా జిల్లా ప్రజలకు సులభతరం చేయడానికి మో బూత్ మొబైల్ యాప్‌ను రూపొందించారు. ఒడిశా ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) నికుంజ బిహారి ధొలొ బుధవారం ఈ యాప్‌ని ప్రారంభించారు. ఓటర్లు తమ నిర్దేశిత పోలింగ్ స్టేషన్ గుర్తించడంలో మో బూత్ యాప్ సహాయపడుతుంది. ఓటరుకు సంబంధించిన పోలింగు బూత్‌లో బారులు తీరిన ఓటర్ల రద్దీ స్థితిగతుల్ని తెలియజేస్తుంది. తదనుగుణంగా ఓటరు పోలింగు కేంద్రానికి వెళ్లే సమయం నిర్ధారించుకునేందుకు వీలు కల్పిస్తుంది. ఖుర్దా జిల్లా అధికార యంత్రాంగం ఈ యాప్‌ని ఆవిష్కరించింది. ప్రస్తుతం ఆండ్రాయిడ్ వెర్షన్‌లో మో బూత్ యాప్ అందుబాటులో ఉంది. త్వరలో ఐఓఎస్ మాడ్యూల్‌లో కూడా అందుబాటులోకి రానుంది. మండల స్థాయి అధికారులు (బీఎల్‌ఓ), సెక్టార్ ఆఫీసర్లతో సహా ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమైన వివిధ సిబ్బందికి ఈ యాప్ బహు విధాలుగా ప్రయోజనకరం అవుతుందని సీఈఓ తెలిపారు. ప్రధానంగా ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్ల రద్దీని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు దోహదపడుతుందని చెప్పారు. సెక్టార్ అధికారులు పోలింగ్ పార్టీ ఆగమన స్థితి, మాక్ పోల్, వాస్తవ పోల్ పురోగతి, పోలింగ్ పూర్తి స్థితి వంటి కీలకమైన డేటాను పర్యవేక్షించగలుగుతారని పేర్కొన్నారు. పారదర్శకత, సమర్థవంతమైన క్యూ నిర్వహణను మెరుగుపరుస్తుందన్నారు. ఈవీఎంలో లోపాలు, శాంతిభద్రతల సమస్యలను పరిష్కరించడంలో సెక్టార్ అధికారులకు చేయూతగా పని చేస్తుందని చెప్పారు. దీనిలో సెంట్రల్ డ్యాష్‌బోర్డ్ జిల్లా అధికారులు, సెక్టార్ ఆఫీసర్లకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఎన్నికలు మాకొద్దు..!

- అవిభక్త కొరాపుట్ జిల్లాలో పలు గ్రామస్తుల నిర్ణయం



ఎన్నికలు బహిష్కరించిన పదుగుడ ప్రజలు

జయపురం: దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడిచాయి. అయినా నేటికి అవిభక్త కొరాపుట్ జిల్లాలోని అనేక గ్రామాలు కనీస మౌలిక సౌకర్యాలకు నోచుకోలేదు. ఇప్పటివరకూ పట్టించుకోని ప్రజలు ఇప్పుడు కఠిన నిర్ణయానికి వచ్చారు. తాము వేసిన ఓట్లతో అందలమెక్కే పాలకులు తమ హక్కులను కాలరాస్తున్నారని, కనీస సౌకర్యాలు కల్పించటంలేదని వారు గ్రహించారు. అందుకే ఈ నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలను బహిష్కరించి.

ఏఏ గ్రామస్తులు బహిష్కరించారంటే..

తమ గ్రామానికి రోడ్లు వేయాలని, మంచినీటిని సమకూర్చాలని డిమాండ్ చేస్తూ దసమంతపూర్ సమితి లుల్లా పంచాయతీ పదుగుడ గ్రామ ప్రజలు ఎంతో కాలంగా అధికారులకు విన్నవించుకుంటున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదంటూ ప్రజలు ఎన్నికలు బహిష్కరించారు. ఆ గ్రామంలో 90 ఆదివాసీ కుటుంబాలకు చెందిన 450 మంది నివసిస్తున్నారు. వారిలో 176 మంది ఓటర్లు ఉన్నారు. వారి కోసం ఒక పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. అయితే ఎన్నికలు బహిష్కరణ నిర్ణయం తీసుకున్నారు. విషయం తెలుసుకున్న దసమంతపూర్ బీడీవో మిలన్ కుమార్ ఝుంకార్ గ్రామానికి వెళ్లి ప్రజలకు నచ్చ చెప్పినా వారు వినలేదు. తమ గ్రామానికి రోడ్డు, మంచినీటి సౌకర్యం కల్పించినప్పుడే ఓటు హక్కును వినియోగించుకుంటామని భీష్మించడంతో అధికారులు వెనుదిరిగారు.

నందపూర్ సమితిలో..

నందపూర్ సమితి రయిసింగ్ పంచాయతీ దేవ సొండిగుడ గ్రామస్తులు కూడా ఎన్నికలు బహిష్కరించారు. తమ గ్రామానికి రోడ్డు వేయాలని, బాసికీ నదిపై వంతెన నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఎన్నికలు బహిష్కరించారు. అంతేకాకుండా గ్రామ మార్గానికి అడ్డంగా వెదురులతో దడికట్టి తమ డిమాండ్‌లతో కూడిన బ్యానర్ కట్టారు.

నారాయణపట్న సమితిలో..

నారాయణపట్న సమితిలో నాలుగు గ్రామాల ప్రజలు తమకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించలేదంటూ ఎన్నికలు బహిష్కరించారు. అయితే విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో గ్రామాలకు వెళ్లి.. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించినట్లు సమాచారం. అలాగే నవరంగ్‌పూర్ జిల్లాలో కూడా పలుగ్రామాల ప్రజలు ఎన్నికలు బహిష్కరించారు. తెంతులికుంటీ, లమతాగుడ, ఖుండియగుడ గ్రామస్తులు సైతం ఎన్నికలు బహిష్కరించారు. తమ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆయా గ్రామస్తులు వాపోయారు. ఈ గ్రామాల్లో 609 మంది ఓటర్లు ఓటు వేయలేదు. అలాగే రాయిఘర్ సమితిలోని ఖుడుకో పంచాయతీ పరిధిలోని 17 గ్రామాల్లో ఉన్న 2,100 మంది ఓటర్లు సమస్యలు పరిష్కరించనందుకు నిరసనగా ఎన్నికలు బహిష్కరించారు.



తెంతులికుంటిలో ఎన్నికలు బహిష్కరించిన ప్రజలు



బ్యానర్ ఏర్పాటు చేసిన నందపూర్ సమితి దేవ్‌సొండిగుడ ఓటర్లు



నారాయణపట్న సమితిలో ఎన్నికలు బహిష్కరించిన ప్రజలకు హామీ ఇస్తున్న అధికారి

ముడిసరుకు కొరత మూతపడిన పేపరుమిల్లు!

- కార్మికుల ఆందోళన



సేవా పేపరుమిల్లు

జయపురం: జయపురం సమీపంలోని గగణాపూర్ సేవా పేపరుమిల్లులో పేపరు ఉత్పాదన మరోసారి నిలిచి పోయింది. ముడిసరుకు కొరత కారణంగా ఉత్పాదన ఆగిపోయినట్లు తెలిసింది. మిల్లులో ఉత్పాదన నిలిచి పోవటంతో శ్రామికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మిల్లులో ఇటువంటి పరిస్థితిలు తరచూ జరుగుతూనే ఉన్నాయని.. అందుకు అనేక కారణాలను యాజమాన్యం చూపుతోందని శ్రామికులు ఆరోపిస్తున్నారు. పేపరుమిల్లులో ఉత్పత్తి కోసం రెండు మిషన్లు ఉన్నాయి. ఒక్కో మిషన్ సామర్థ్యం 100 మెట్రిక్ టన్నులు. కాగా ఒక మిషన్ మాత్రమే పనిచేస్తుందని.. అందువలన నెలకు మూడు వేల టన్నుల పేపరు ఉత్పత్తి అవుతున్నదని వారు వెల్లడించారు. ముడిసరుకు లేక పోవటంతో ఉత్పత్తి నిలిచి పోవటంతో తమకు జీతాలు కూడా యాజమాన్యం చెల్లించలేదని, ఇప్పటికే తమకు ఐదు నెలల జీతాలు యాజమాన్యం బకాయి ఉన్నట్టు కార్మికులు చెబుతున్నారు. పూర్తిస్థాయిలో మిల్లులో ఉత్పత్తి ప్రారంభించాలని, బకాయి జీతాలు చెల్లించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

వర్షంతో ఉపశమనం

పర్లాకిమిడి: పట్టణంలో బుధవారం మధ్యాహ్నం గంటసేపు వర్షం పడింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి, మోహానాలో వర్షం కురిసింది.

ఇరువర్గాలపై కేసు నమోదు



చాపురం గోవిందపురం గ్రామాల్లో పోలీస్ పికెట్

శ్రీకాకుళం రూరల్: ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ సమయంలో చాపురం, గోవిందపురం పరిధిలో టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గీయులు ఒకరిపై ఒకరు కర్రలు, రాళ్లతో దాడులకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ఇరు గ్రామాలకు చెందిన తొమ్మిది మందిపై రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వాసుదేవరావు తెలిపారు. రెండు గ్రామాల్లోనూ పోలీస్ పికెట్ కొనసాగుతుందని చెప్పారు.

ఆటో నుంచి జారిపడి వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని సూర్యమహల్ కూడలి సమీపంలో ఆటో ప్రమాదానికి గురైన వ్యక్తి జెమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చినమండలవీధిలో పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న తోట శ్రీనివాసరావు (46) తన చెల్లెల్లి ద్దరితో కలిసి సరుబుజ్జిలిలో చావుపరామర్శకని బయల్దేరారు. సూర్యమహల్ కూడలి వద్ద ఆటో ఎక్కి సీటులో కూర్చుంటుండగానే డ్రైవర్ నిర్లక్ష్యంతో స్టార్ట్ చేసి ముందుకు తీయడంతో శ్రీనివాసరావు రోడ్డుపై పడిపోయాడు. దీంతో రాగోలు జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. తలపై గాయం కనిపించకపోయినా అంతర్గతంగా రక్తస్రావమై మృతి చెందినట్లు అక్కడ ముఖ్య వైద్యాధికారి ప్రవీణ్ ధ్రువీకరించడంతో ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహితకు గాయాలు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని కిమ్స్ సమీపంలోని దత్తాత్రేయస్వామి గుడి వద్ద ద్విచక్ర వాహనం పైనుంచి జారిపడి ఓ వివాహితకు గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకునేందుకు విజయనగరం జిల్లా రాజాం మండలం వంజరాంపేట నుంచి గోవిందరావు, సత్యవతి దంపతులు తమ కుమారుడు, కోడలుతో కలిసి రెండు ద్విచక్రవాహనాల్లో బుధవారం వచ్చారు. తిరుగు ప్రయాణంలో కిమ్స్ సమీపంలోని దత్తాత్రేయ గుడి వద్దకు వచ్చేసరికి స్పీడ్ బ్రేకర్ గమనించకపోవడంతో గోవిందరావు వెనుక కూర్చున్న భార్య సత్యవతి జారిపడి ఎదురుగా ఉన్న డివైడర్‌పై పడిపోయింది. ఆమె తలకు తీవ్ర గాయమవ్వడంతో కుటుంబసభ్యులు సమీపంలోని కిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాదరావు పేర్కొన్నారు.

ఘనంగా బంగారమ్మ జంగిడి ఊరేగింపు



జంగిడి ఊరేగిస్తున్న భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట వంశధార నదీతీరంలో కొలువైన బంగారమ్మ తల్లి అమ్మవారి పెద్ద పండగలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ నెల 28వ తేదీ వరకు పండగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం అమ్మవారి జంగిడి ఊరేగింపు ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ధూపదీపాలతో నైవేద్యం, ప్రసాదాలు సమర్పించారు.

నాలుగోసారి గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకున్న డాక్టర్ మంత్రి వెంకటస్వామి

శ్రీకాకుళం: సామాజిక సేవకుడు డాక్టర్ మంత్రి వెంకటస్వామికి నాలుగో సారి గౌరవ డాక్టరేట్ లభించింది. బుధవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో డే స్ప్రింగ్ ఇంటర్‌నేషనల్ యూనివర్సిటీ, భారత్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సంయుక్తంగా నిర్వహించిన సభలో వెంకటస్వామికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్ హానరరీ డిగ్రీ పట్టా, మెడల్‌ను ఇచ్చి గౌరవించారు.

సెలవుల్లో జాగ్రత్త..!

- పిల్లలు ప్రమాదాల బారిన పడకుండా చూడాలి
- నైతిక విలువలపై అవగాహన కల్పించాలి
- సృజనాత్మకత పెంపుపై దృష్టి పెట్టాలంటున్న నిపుణులు



టెక్కలి సత్యసాయి శాంతి సుధా మందిరంలో బాల వికాస్ విద్యార్థులకు నైతిక విలువలు నేర్పుతున్న నిర్వాహకులు

టెక్కలి: వేసవి సెలవులు ప్రారంభమై ఇరవై రోజులు పూర్తయ్యాయి. చాలామంది చిన్నారులు తాతయ్య వారి ఊళ్లకు వెళ్లగా.. మరికొంత మంది ఇళ్ల వద్దే కాలక్షేపం చేస్తున్నారు. ఈ సమయంలో ఆడుకునేందుకు బయటకు వెళ్తున్న పిల్లల పట్ల తల్లిదండ్రులు, ఇంటి పెద్దలు దృష్టి సారించాలని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా చెరువులు, నదుల వద్దకు వెళ్లకుండా చూడాలని అంటున్నారు. కొత్తూరులో తన అమ్మమ్మ ఇంటికి వచ్చి సరదాగా సమీపంలో పారాపురం మినీ జలాశయానికి వెళ్లిన తొమ్మిదో తరగతి విద్యార్థి హరీష్ మృత్యువాత పడ్డాడు. పాత హిరమండలంలో తోటి స్నేహితులతో కలిసి వంశధార నది వద్దకు స్నానానికి వెళ్లిన తొమ్మిదో తరగతి విద్యార్థి బాల మాధురి మృత్యువాత పడింది.. ఇలా ఏటా వేసవి సెలవుల్లో ఎంతో మంది విద్యార్థులు ఏదో ఒక రూపంలో మృత్యువాత పడుతున్నారు. ఇలాంటికి జరగకుండా పిల్లలను ఓ కంట కనిపెడుతూ ఉండాలి. ఎండల భారిన పడి అనారోగ్యానికి గురికాకుండా, ఇతర ప్రమాదాల బారిన పడకుండా ప్రత్యేక దృష్టి సారించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. పిల్లలకు రామాయణ, మహాభారతం, ఇతిహాస కథలు, మెదడుకు పదును పెట్టే ఆటలతో ఈ వేసవి సెలవుల్లో సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలి.

పల్లెటూర్లు మేలు..

దేశ ప్రగతికి మూలాలు గ్రామీణ ప్రాంతాలు. వేసవి సెలవుల్లో పిల్లలను అమ్మమ్మ, నాయనమ్మ ఇంటికి పంపించేందుకు ప్రయత్నించండి. నగర కాలుష్యానికి దూరంగా పిల్లలు పల్లెటూరి వాతావరణాన్ని ఆస్వాదిస్తే అనేక విషయాలు తెలుస్తాయి. ముఖ్యంగా వ్యవసాయ పద్ధతులు ఆచార వ్యవహారాలు మన సంస్కృతి తెలిసే అవకాశం ఉంటుంది.

పిల్లలపై కోపం వద్దు..

వేసవి సెలవుల్లో పిల్లలు అల్లరి చేసే అవకాశం ఉంటుంది. దీంతో అదే పనిగా కోపం తెచ్చుకోవద్దు. వారికి అర్థమయ్యేలా చెప్పి చూడండి. వారిని ఏదైనా పనిలోబిజీగా ఉండేలా చూడండి. రోజులో కొద్ది సమయం పిల్లలకు కేటాయించి వారితో ముచ్చటించండి. వారికి నచ్చిన ఆహారం తయారు చేసి తినిపించండి. పిల్లలతో గార్డెనింగ్ చేయించడం ద్వారా అల్లరిని కట్టిపెట్టవచ్చు.

విలువలు నేర్పించాలి..



పెద్దలను గౌరవించే నైతిక విలువలను పిల్లలకు నేర్పించేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి. ముఖ్యంగా ఆడ పిల్లలు, వృద్ధులపై గౌరవం పెరిగేలా వారిలో మంచి భావాన్ని కల్పించాలి. రామాయణం, మహాభారతంతో పాటు నీతికథలు బోధించే వారి వద్దకు పిల్లల్ని పంపించాలి. సాహిత్యంపై అవగాహన కల్పించాలి.

– బి.అన్నపూర్ణమ్మ, సత్యసాయి బాల వికాస్ నిర్వాహకురాలు, టెక్కలి

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- పిల్లలను బావులు, చెరువుల్లో ఈత కొట్టేందుకు పంపించకండి. అవసరమైతే మీరే స్వయంగా వారికి తోడుగా వెళ్లండి.
- ద్విచక్రవాహనాలు నడపమని వారి చేతికి తాళాలు ఇవ్వవద్దు. వారికి తాళాలు కనిపించకుండా ఉండేలా జాగ్రత్త తీసుకోండి. మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లు వారి చేతికి ఇవ్వకపోవడం ఉత్తమం.
- స్నేహితులతో కలిసి దూరప్రాంతాలకు పంపకండి.
- మధ్యాహ్న సమయంలో ఆరుబయట ఆడుకోవడానికి అనుమతించకండి. ఉదయం , సాయంత్రం వేళల్లో మాత్రమే ఆడుకోవడానికి పంపించడం మేలు.
- ఇంట్లో పెద్దలతో వారు ఎక్కువ సమయం గడిపేలా చూడండి. వీలైనంత వరకు మన సంప్రదాయాలను నేర్పించాలి.
- రామాయణం, మహాభారతం, ఇతిహాస కథలు చెప్పే వారి వద్దకు పిల్లల్ని పంపించండి.
- పిల్లలు ఆడుకోవడానికి సమయం నిర్ణయించండి. వేసవికాలంలో పిల్లలు ఆడుకునేందుకు నిర్దిష్టమైన టైం టేబుల్ ను రూపొందించండి. అప్పుడు పిల్లలు టైం టేబుల్ ప్రకారం ఆడుకునే వీలుంది. అదే పనిగా ఎండల్లో ఆడుకోకుండా నీడ పట్టునే ఉంటారు. ముఖ్యంగా పిల్లలు టీవీ ఎక్కువ సమయం చూడకుండా వారిని ఫిజికల్ గేమ్స్ వైపు మోటివేట్ చేస్తే మంచిది.
- పిల్లలకు ఉదయం యోగా, సాయంత్రం కరాటే, డ్రాయింగ్, నృత్యం, స్విమ్మింగ్, క్రికెట్, చెస్, వంటి వాటిలో శిక్షణ ఇప్పించడం వల్ల వారు బోర్ ఫీల్ అవ్వరు.
- వేసవికాలంలో పిల్లలు అల్లరి చేస్తున్నారని వారికి మీ స్మార్ట్ ఫోన్ ఇచ్చి ఆరోగ్యాన్ని పాడు చేయకండి.
- మొబైల్ ఫోన్ బదులు మంచి కథల పుస్తకాలు, డ్రాయింగ్ పుస్తకాలు కొనివ్వండి. వారిలో సృజనాత్మకతను వెలికి తీసేలాబొమ్మలు వేయించండి. లేదా ఇతర కళలను నేర్పించండి.

పరిహారం చెల్లించాలని డిమాండ్



జిల్లా కలెక్టర్ సచిన్ పవార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయులు

మల్కన్‌గిరి: రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ఉపాధ్యాయుడు, ఎన్నికల ప్రొసీడింగ్ అధికారి ఇంద్రజిత్ కిర్సనీ కుటుంబానికి పరిహారం చెల్లించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి వద్ద మంగళవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇంద్రజిత్ కిర్సనీ ప్రాణాలు కోల్పోయారు. ఈయన కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ సచిన్ పవార్‌కు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు తారక్ మండాల్, సంఘ ప్రతినిధులు రంజిన్ నాయిక్, ప్రదిప్ కుమార్ దోలాయి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్‌ను హత్య చేస్తానని బెదిరింపు



పోలీసులకు పిర్యాదు చేసిన పాఢీతో సంఘ ప్రతినిధులు

జయపురం: బాల్య వివాహాన్ని అడ్డుకున్న తనను హత్య చేస్తామని ఒక యువకుడు బెదిరించాడని అంగన్‌వాడీ వర్కర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇక నుంచి అంగన్‌వాడీ వర్కర్లు బాల్య వివాహాలను అడ్డుకోవడం, అవగాహన కల్పించడం జరగదని స్పష్టం చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. ఏప్రిల్ 24వ తేదీన బొయిపరిగుడ సమితి మహుళి గ్రామ పంచాయతీలోని ఒక గ్రామంలో బాల్య వివాహం జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్న విషయం తెలిసిన బపాణిగుడ అంగన్‌వాడీ వర్కర్ సంధ్యారాణి పండకు సమాచారం అందింది. దీంతో ఆమె బొయిపరిగుడ సీడీపీవో, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, స్థానిక సర్పంచ్, స్థానిక పోలీసులు, ఏఎన్ఎం తదితరులకు సమాచారం అందించింది. వారందరూ కలిసి ఆ గ్రామానికి చేరుకున్నారు. వివాహం జరుపుతున్న యువతికి 18 ఏళ్ల కన్నా తక్కువ వయస్సు అని నిర్ధారించుకున్నారు. అధికారులు, గ్రామ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి బాల్య వివాహం నేరమని తెలియజేశారు. అందుకు అందరూ అంగీకరించి వివాహాన్ని ఆపివేసి మైనర్ బాలికను ఆమె తల్లిదండ్రుల ఇంటికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. బాలికకు 18 ఏళ్లు నిండిన తర్వాత వివాహం చేసేందుకు ఉభయవర్గాలు అంగీకరించారు. అయితే ఈనెల 13వ తేదీన అంగన్‌వాడీ వర్కర్ పాఢీ ఎలక్షన్ డ్యూటీలో భాగంగా బొయిపరిగుడ వచ్చింది. ఎన్నికల విధిలో ఉన్న సమయంలో ఒక యువకుడు ఆమె వద్దకు వచ్చి నీవు నా వివాహం ఆపుతావా, అని నిన్ను చంపుతానని హెచ్చరించాడు. దీంతో ఆమె ఈ విషయాన్ని ప్రిసైడింగ్ ఆఫీసర్‌కు తెలిపింది. ప్రిసైడింగ్ ఆఫీసర్ ఈ విషయం పోలీసులకు తెలియజేశారు. పోలీసులు వచ్చేసరికి ఆ యువకుడు పరారయ్యాడు. మంగళవారం ఆమె తన ప్రాణాలకు ప్రమాదం ఉందని, జరిగిన విషయాన్ని అంగన్‌వాడీ వర్కర్ల సంఘానికి తెలియజేసింది. అందుకు స్పందించిన బొయిపరిగుడ అంగన్‌వాడీ వర్కర్ల సంఘం నేతలతో బొయిపరిగుడ పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది.

గుడ్డు బిల్లుల్లోఇదేం తీరు?

- ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించేందుకు కొందరు ఎస్ఎస్ఏ ఉద్యోగుల స్కెచ్
- డైట్ బిల్లులకు భిన్నంగా లేఖలు ఇవ్వాలని కేజీబీవీ ఎస్‌వోలపై ఒత్తిడి

శ్రీకాకుళం: జిల్లా ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించేందుకు సర్వశిక్షా అభియాన్‌లో కొందరు ఉద్యోగులు స్కెచ్ వేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిత్యావసర సరకులు, మాంసం, గుడ్లు సరఫరా చేసేందుకు ముందుగా టెండర్లు నిర్వహిస్తారు. టెండర్ రోజున ఖరారు చేసిన ధరలకే సంవత్సరం పొడవునా సరఫరా చేయాల్సి ఉంటుంది. రేటు పెరిగినా, తగ్గినా ఇందులో మార్పు ఉండదు. దీనిలో భాగంగా గుడ్డు ధర పేపరు ధరకు సరఫరా చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే ఇందుకు భిన్నంగా కొన్ని నెలల నుంచి గుడ్డు ధర రూ.6.30 పైసలకు బిల్లు దాఖలు చేస్తున్నారు. బిల్లులు దాఖలు చేసే నాటికి గుడ్డు ధర రూ. 5.50పైసలు ఉండగా అదనంగా 80పైసలు చెల్లిస్తూ వస్తున్నారు. కేజీబీవీల నుంచి రూ.6.30పైసలకు బిల్లులు వస్తుండగా ఆ మేరకు చెల్లింపులు కూడా జరిగిపోయాయి. ఎస్ఎస్ఏలోని అధికారుల సూచనల మేరకే బిల్లులు దాఖలు చేస్తున్నట్లు ఎస్‌వోలు చెబుతున్నారు. కాగా అదనపు చెల్లింపుల విషయం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. ఆయన వివరణ కోరడంతో రెండు రోజులుగా ఎస్‌వోలపై ఎస్ఎస్ఏలోని కొందరు ఉద్యోగులు ఒత్తిడి తెస్తూ పేపరు ధరకే బిల్లులు దాఖలు చేస్తున్నట్లు లిఖితపూర్వకంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు ఎస్‌వోలు 'సాక్షి'కి తెలిపారు. బిల్లులు దాఖలు చేసినదానికి విరుద్ధంగా లేఖలు ఇస్తే తాము తప్పు చేసినట్లు అవుతుందనిర, తమను హెచ్చరిస్తూ వ్యాఖ్యానాలు చేస్తున్నారని, వాయిస్ మెసేజ్‌లు కూడా పెడుతున్నారని వాపోతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో లేఖలు ఇవ్వకూడదని బుధవారం జరిగిన ఎస్‌వోల రహస్య సమావేశంలో నిర్ణయించుకున్నట్లు భోగట్టా. ఇదిలా ఉంటే నిత్యావసర సరకుల సరఫరా కాంట్రాక్ట్ కూడా కాంట్రాక్ట్ పొందిన వ్యక్తి కాకుండా వేరొకరు సరఫరా చేస్తున్నట్లు, అవి నాశిరకంగా ఉంటున్నట్లు ఎస్‌వోలు చెబుతున్నారు. అయితే బిల్లులు మాత్రం కాంట్రాక్ట్ పొందిన సంస్థ నుంచే దాఖలు అవుతుండడంతో వారికి బిల్లులు చెల్లిస్తున్నారు.

రికవరీ చేస్తాం..

ఈ విషయాన్ని అకౌంట్ సెక్షన్ సూపరింటెండెంట్ పద్మావతి వద్ద ప్రస్తావించగా గుడ్డు ధర అదనంగా చెల్లించడం వాస్తవమేనన్నారు. వారి నుంచి రికవరీ చేస్తామన్నారు. బిల్లుకు విరుద్ధంగా ఎస్‌వోలను లేఖలు అడగడం నిజమేనని, ఎఫ్ఏవో సూచనల మేరకే ఎస్‌వోలకు వాయిస్ మెసేజ్ పెట్టామన్నారు. నిత్యావసర సరకుల కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారో, ఎవరు సరఫరా చేస్తున్నారో తనకు తెలియదని పేర్కొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో 'నాన్‌స్టాప్'గా రద్దీ



నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద రద్దీ

శ్రీకాకుళం అర్బన్: జిల్లాకేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ బుధవారం ప్రయాణికులతో కిటకిటలాడింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓట్లు వేసేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం స్వస్థలాలకు బయలుదేరేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకోవడంతో రద్దీగా కనిపించింది. టికెట్ల కోసం నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద బారులు తీరుతూ కనిపించారు. ప్రయాణికుల రద్దీకి తగ్గట్లు అధికారులు బస్సులను సిద్ధం చేశారు.

'ఆ విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలి'


శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు వేసవి సెలవుల్లోనూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గంగు మన్మధరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండుటెండలు, ఉక్కపోతలతో ఇంటి వద్ద కూడా అలమటిస్తున్న తరుణంలో విద్యార్థులు విద్యాసంస్థల్లో ఎలా ఉండగలరని ప్రశ్నించారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా విద్యార్థులు నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక తరగతులు, అదనపు తరగతులు నిర్వహిస్తున్న స్కూల్స్, కాలేజీలపై సంబంధిత జిల్లా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పందించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

దేవస్థానం భూముల శిస్తుల దుర్వినియోగంపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని గుడివీధి సమీపంలోని ఉమారుద్ర కోటేశ్వర స్వామి దేవాలయానికి అనుసంధానంగా ఉన్న ఆంజనేయస్వామి దేవస్థానం తాలుకా భూముల శిస్తుల సొమ్ము దుర్వినియోగమైనట్లు ఆలయ ఈవో ఎం.సుకన్య గురువారం ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పై రెండు దేవాలయాల్లో ఏకీకృత సర్వీసు కింద అటెండరుగా పనిచేస్తున్న వి.సతీష్ దేవస్థానాలకు చెందిన భూముల శిస్తు సొమ్ము అనధికారికంగా వసూళ్లు చేసి దుర్వినియోగానికి పాల్పడ్డాడు. ఆంజనేయ దేవాలయానికి సంబంధించి రూ.2,16,800, కోటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి రూ.3,162 సొమ్ము వసూళ్లకు పాల్పడటమే కాక వాటికి సంబంధించిన రశీదులను రిజిస్టర్ బుక్ నుంచి మాయం చేశాడు. ఇటీవలే విధుల్లోకి చేరిన ఈవో సుకన్య ఉన్నతాధికారుల దృష్టికి విషయం తీసుకెళ్లగా వారు ఫిర్యాదు చేయమని చెప్పడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గణేష్ పేర్కొన్నారు.

జూలైలో ఖరీఫ్‌కు తోటపల్లి నీరు విడుదల

- గత ఐదు సీజన్లలో తోటపల్లి పాత ఆయకట్టుకు నీటి పంపిణీ
- శివారు ఆయకట్టులో పెరిగిన పంటల దిగుబడి



తోటపల్లి జలాశయం

వీరఘట్టం: పాత ఆయకట్టుకు ప్రతి ఏటా ఖరీఫ్‌లో పూర్తిస్థాయిలో నీరందిస్తూ పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలను తోటపల్లి జలాశయం సస్యశ్యామలం చేస్తోంది. ఈ మేరకు గడిచిన ఐదు ఖరీఫ్ సీజన్లలో ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఎటువంటి ఇబ్బందులు పడకుండా జలవనరులశాఖ అధికారులు ప్రణాళికా బద్ధంగా నీటిని పంపిణీ చేశారు. అంతేకాకుండా ఓ పక్క కాలువల ఆధునికీకరణ పనులు చేపడుతూనే మరో పక్క సాగునీరు పంపిణీ చేస్తూ సాగును సస్యశ్యామలం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గడిచిన ఐదేళ్లుగా పంటల దిగుబడి పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కూడా సకాలంలో నీటిని పంపిణీ చేసేందుకు జలవనరులశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. జూలై మొదటివారంలో తోటపల్లి పాత ఆయకట్టుకు నీటిని విడుదల చేయనున్నారు.

ఇంతవరకు జరిగిన ఆధునికీకరణ పనులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనులపై దృష్టి సారించింది.37.536 కి.మీలు పొడవున్న ఎడమ కాలువలో ఇంతవరకు 16.843 కి.మీ వరకు కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. అలాగే 17.616 కి.మీ పొడవున్న కుడి కాలువలో 9.376 కి.మీ వరకు కాంక్రీట్ పనులు చేపట్టారు. మొత్తం 55.152 కి.మీకు గాను ఇంతవరకు 26.919 కి.మీ అనగా 48 శాతం పనులు చేపట్టారు. అంతేకాకుండా ఎడమకాలువలో అచ్చపువలస వద్ద, 6వ బ్రాంచ్ వద్ద, ఎం.రాజపురం వద్ద, కత్తులకవిటి వద్ద వెడల్పయిన వంతెనలు నిర్మించి వాహనరాకపోకలకు మార్గం సుగమం చేశారు. ఇలా నీటి పంపిణీకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా గత ఖరీఫ్‌లో చర్యలు చేపట్టి శివారు వరకు సాగునీరందించారు. ఇలా ఒక పక్క ఆధునికీకరణ పనులు చేపడుతూ మరో పక్క గత ఐదు ఖరీఫ్ సీజన్లలో సకాలంలో కాలువలకు సాగునీరందిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తోటపల్లి ఆయకట్టును సస్యశ్యామలం చేసింది. ఈ ఏడాది కూడా సకాలంలో నీరు విడుదల చేసి శివారు ఆయకట్టుకు తొలి ప్రాధాన్యంగా నీటి పంపిణీ చేయనున్నారు.

జూలైలో నీటి విడుదల



గత ఖరీఫ్ సీజన్‌లో శివారు రైతులు ఇబ్బందులు పడకుండా సాగునీరు పుష్కలంగా అందించాం. దీంతో గతేడాది పంటల దిగుబడి కూడా బాగా వచ్చింది. శివారు ప్రాంతంలో కాలువల్లో, డిస్ట్రిబ్యూటరీ చానల్స్‌లో, బ్రాంచ్ కాలువల్లో ప్రస్తుతం పేరుకుపోయిన పిచ్చి మొక్కలు తొలగించి జూలైలో నీటి విడుదలకు చర్యలు చేపడుతున్నాం.

దమలపాటి రవికుమార్, డీఈఈ జలవనరులశాఖ, పాలకొండ డివిజన్

• విన్యాసకారులు



ఇచ్ఛాపురం మండలం కమఠాయిపుట్టుగ– లండపుట్టుగలో జరుగుతున్న అసిరిపోలమ్మ గ్రామదేవత ఉత్సవాల్లో ఒడిశా కళాకారుల గారడీ విన్యాసాలు అదరహో అనిపించాయి. ముఖ్యంగా నిప్పుతో చేసిన విన్యాసాలు గగుర్పాటుకు గురిచేశాయి. – ఇచ్ఛాపురం రూరల్

• శ్రమైక్యజీవులు



జి.సిగడాం మండలంలోని పొగిరి–జి.సిగడాం గ్రామాల మధ్య సాగునీటి బావిలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించేందుకు రైతులు నడుం బిగించారు. నేరుగా రైతులే భుజానికి కర్రలో చేసిన పరికరాలు అమర్చుకుని మండుటెండను సైతం లెక్క చేయకుండా శ్రమదానం చేశారు. – జి.సిగడాం

• ఈదురుగాలులు



హిరమండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల చెట్టు కొమ్మలు నేలకొరిగాయి. గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు సాయంత్రం వరకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు ఉక్కపోతతో విలవిల్లాడిన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. – హిరమండలం

క్లుప్తంగా

హోంగార్డ్ కుటుంబానికి చేయూత



చెక్కును హోంగార్డ్ సతీమణి ధనలక్ష్మికి అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖలో హోంగార్డుగా పనిచేస్తూ పార్వతీపురం మన్యం ఆర్‌టీఏ విభాగంలో విధులు నిర్వహిస్తూ, ఇటీవల హార్ట్‌స్ట్రోక్‌తో మృతిచెందిన కె.మహేశ్వరరావు కుటుంబానికి సిబ్బంది ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మేరకు హోంగార్డు చేయూత కింద ఒకరోజు అలవెన్స్ రూ.3.20 లక్షల చెక్కును మృతుడి సతీమణి కె.ధనలక్ష్మికి ఎస్పీ ఎం.దీపిక జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ ప్రభాకరరావు, హోంగార్డ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తెట్టంగిలో కొనసాగుతున్న పోలీస్ పికెట్

వీరఘట్టం: మండలంలోని తెట్టంగిలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది.ఈనెల 13న ఎన్నికల రోజున గ్రామంలో ఇరువర్గాల మధ్య జరిగిన తగాదాతో అప్రమత్తమైన పోలీసులు ప్రస్తుతం గ్రామంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం వచ్చేంతవరకు పోలీసు పికెట్ ఉంటుందని ఎస్సై షేక్ ఫక్రుద్దీన్ సోమవారం తెలిపారు.

కొఠియా గ్రామాల్లో విద్యుత్ మీటర్లు



గంజాయిభద్ర మాజీ సర్పంచ్ గెమ్మెల బిసు

సాలూరు రూరల్: ఆంధ్రా, ఒడిశా సరిహద్దు గ్రామాలైన కొఠియా పంచాయతీలోని గంజాయిభద్ర తదితర గ్రామాల్లో విద్యుత్ మీటర్లు అమర్చినట్లు గంజాయిభద్ర మజీ సర్పంచ్ గెమ్మెల బీసు తెలిపారు. ఆయన మంగళవారం ఈ మేరకు విలేకరులతో మాట్లాడుతూ మార్చి 28వ తేదీన ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది కొఠియా గ్రామాల్లో ఇంటింటికీ విద్యుత్ మీటర్లు అమర్చే ఏర్పాట్లు చేస్తుంటే ఒడిశా అధికారులు వారిని అడ్డుకున్న విషయం తెలిసిందేనన్నారు. అయితే ఆ విద్యుత్ మీటర్లను ఇంటింటికీ గ్రామపెద్దగా పంపిణీ చేశామన్నారు. అయితే ప్రస్తుతం ఆ మీటర్లను ఇంటింటికీ బిగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏజెన్సీ గ్రామాల గిరిజనులకు 200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు.

ఏటీఎంలో చోరీ యత్నం



దుండగులు తెరిచిన కెనరా బ్యాంక్ ఏటీఎం ఫ్రంట్ డోర్

చీపురుపల్లి: పట్టణంలోని ఆంజనేయపురంలో గల కెనరా బ్యాంక్ ఏటీఎం కేంద్రంలో దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. దీనిపై కెనరా బ్యాంక్ మేనేజర్ ఆమిటి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టణంలోని ఆంజనేయపురంలో కెనరా బ్యాంక్ వద్ద ఉన్న ఏటీఎం కేంద్రంలో మంగళవారం రాత్రి దొంగలు చొరబడి ఏటీఎం ఫ్రంట్ డోర్ పగలగొట్టి చోరీకి యత్నించారు. అయితే ఏటీఎం నుంచి ఎలాంటి నగదు చోరీ జరగలేదని మేనేజర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏటీఎంలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఏటీఎంలో చోరీకి వచ్చిన దుండగుడు మాస్క్ వేసుకుని ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఎలాగైనా నిందితుడిని పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు

పార్వతీపురం: జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ విధిస్తూ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ప్రశాంత వాతావరణానికి ఎవరూ భంగం కలిగించరాదన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికలు లెక్కింపు జరిగేంత వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎక్కడా ప్రజలు గుంపులుగా ఉండరాదన్నారు.

ఇంటింటా పాడిపంట



మిరప పంటకు సాగునీరు అందిస్తున్న రైతు



పాల సొసైటీలో పాలుపోస్తున్న పాడిరైతులు

- సాగులో పోటీ..దిగుబడిలో మేటి
- ఏటా లక్షల్లో ఆదాయం
- కరువును జయిస్తున్న రైతులు

రామభద్రపురం: పేరుకే అది పల్లె. చూస్తే పట్టణాన్ని తలపిస్తుంది. ఈ పల్లె చుట్టూ సారవంతమైన భూములు, కనుచూపు మేర ఎటు చూసినా పచ్చటి పంట పొలాలు, పండ్ల తోటలు, కూరగాయల పంటలు, పాడి పశువులు. పాడి పంటలు తప్ప అన్య మెరుగని ఊరు ఇది. పంటల సాగులో అధిక దిగుబడులు సాధిస్తూ పలు గ్రామాలకు ఆదర్శంగా నిలిచిన ఆ ఊరే రామభద్రపురం. సుమారు 3500 పైబడి కుటుంబాలు ఉన్న ఈ గ్రామం పాడి,పంటలతో తులతూగుతూ మిగిలిన గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది. పశుపోషణతో పాటు ఉద్యాన పంటలతో విరాజిల్లుతోంది. జిల్లాలోని పల్లెల్లో రామభద్రపురంలో దాదాపుగా 70 నుంచి 80 శాతం వరకు ప్రతి ఇంటిలోనూ ఉద్యాన పంటలు పండించడంతో పాటు పాడిపశువులు పెంచేందుకు గ్రామస్తులు చేస్తున్న కృషి ఎందరికో ఆదర్శం. ఇక్కడి రైతులు వరితో పాటు అన్ని రకాల కూరగాయ పంటలు సాగుచేస్తారు. ఆకుకూరలు, బెండ, దొండ, టమాటో, బీర, స్వీట్‌కార్న్, వంగ, కాలిఫ్లవర్, క్యాబేజీ తదితర కూరగాయల పంటలు, బంతి, కనకంబరాలు వంటి పూలు పండిస్తున్నారు.

పంటల సాగులో పోటీత్వతం

గ్రామంలో తాము ఏ పంట సాగు చేస్తున్నమనే దానికంటే అవతలి రైతు కంటే ఎక్కువ దిగుబడి సాధించాలనే పోటీతత్వం ఇక్కడి రైతుల్లో ఉంది. సుమారు 50 శాతం మంది రైతులు నేలబావులు, సొంత డబ్బుతో చిన్న చిన్న బోరుబావులు తవ్వుకుని వాటి ద్వారా సాగునీరు అందిస్తూ పంటలు సాగు చేస్తున్నారు. ఒకరికి మించి ఒకరు దిగుబడులు సాధిస్తున్నారు. ఒక్కో రైతు కనీసం అరెకరాకు తగ్గకుండా అంతర పంటల సాగుతో కూరగాయ పంటలు సాగు చేస్తూ వేల రూపాయలు ఆదాయం పొందుతున్నాడు. గ్రామంలో అంతరరాష్ట్ర కూరగాయల మార్కెట్ ఉండడంతో ఇక్కడికి విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల వ్యాపారులే కాకుండా ఇతర రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వ్యాపారులు నేరుగా వ్యాన్‌లతో వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు.

2వేల వరకు పాడి పశువులు

గ్రామంలో ఆవులు, గేదెలు 2వేల వరకు ఉన్నాయి. ప్రతి ఒక్కరూ దాదాపు 20 సెంట్ల నుంచి అరెకరా వరకూ పాడి పశువులకు పచ్చ గడ్డి సాగుచేస్తున్నారు. ఆ గడ్డితో పాడి పశువుల దాణా ఖర్చు తగ్గించుకోవడంతో పాటు పాల దిగుబడి పెంచుకుంటూ ఆదాయం ఆర్జిస్తున్నారు. ఏడాదికి ఈ గ్రామంలో రైతులు సుమారు రూ.కోటి వరకూ ఆదాయం పొందుతున్నారు. తీవ్ర వర్షాభావంతో వరి సాగు లేక కరువు ఏర్పడినా కూడా దాన్ని సైతం జయిస్తూ రైతన్నలు ఆనందంగా జీవనం సాగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన రైతుభరోసా పథకం పేరుతో అందజేస్తున్న పెట్టుబడి సాయం తమకు కలిసి వస్తోందని, మరింత ఉత్సాహంతో పంటలు సాగుచేస్తున్నామని రైతులు చెబుతున్నారు.

మహిళా భాగస్వామ్యంతో

ఇంటికి ఇల్లాలే వెలుగన్న నానుడి ఇక్కడ రుజువవుతుంది.ఆ గ్రామంలో పాడి పశువుల పోషణలోను, పంటలు పండించడంలోనూ మహిళలదే కీలక పాత్ర. నిత్యం పశుగ్రాసం అందించడం మొదలు..పంటలు దిగుబడి సాధించేవరకూ కుటుంబ యజమానికి చేదోడు వాదోడుగా మహిళలు నిలుస్తున్నారు. ప్రతిరోజూ వేకువ జామునే లేచి పంట పొలాలకు వెళ్లి కూరగాయలు కోయడం, మార్కెట్‌కు తెచ్చి విక్రయించడం చేస్తుంటారు. పాడి పంటలతో ఆదాయం పెరగడంతో తమ చిన్నారులను ఉన్నత చదువులు చదివించుకుంటున్నారు.



గ్రామాన్ని ఆనుకుని ఉన్న పచ్చటి పంట పొలాలు



కూరగాయల మార్కెట్‌కు కూరగాయలు తీసుకెళ్తున్న రైతులు



ఆకు కూరలు తీసుకువెళ్తున్న మహిళా రైతు

పంటలే జీవనాధారం



మా గ్రామంలో సుమారు ప్రతి ఇంటికి పాడి ఆవులు, ఉద్యాన పంటలు ఉన్నాయి. నేను రెండు పాడి పశువులు పోషించడంతో పాటు కూరగాయలు వేశాను. పొట్టి చిక్కుడు పంటలో అంతర పంటగా బీర పంట వేశాను, బీర సాగు వట్టిపోయింది.కొద్ది రోజుల్లో పొట్టి చిక్కుడు పంట కోతకు అందివస్తుంది.

మద్రాపు బంగారమ్మ,
రైతు, రామభద్రపురం

పంటల సాగుపైనే చర్చ



పాడి పంటలకు రామభద్రపురం ఆదర్శంగా నిలుస్తుంది. గ్రామంలోని రైతులు వ్యవసాయ సాగుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. గ్రామంలోని ఏ ఇద్దరు రైతులు కలిసినా పాడి పశువుల పోషణ, పంటల సాగుపైనే చర్చిస్తుంటారు. ఎలాంటి పంట పెట్టాలి? పాడి ఆవు ఎన్ని పాలు ఇస్తుంది.పెట్టుబడి ఎంతవుతుంది.పంటలో దిగుబడి సాధించేందుకు ఏం చేయాలనే అంశాలపైనే మాట్లాడుతుంటారు. ఇదే విషయాలపై వ్యవసాయాధికారుల సలహాలు సూచనలు పాటిస్తున్నారు. మంచి సారవంతమైన భూములు కలిగి ఉండడంతో పాటు శ్రమించే గుణం ఎక్కువగా ఉండడం వల్ల ఇక్కడి రైతులు పాడి పంటల సాగులో ఆదర్శంగా నిల్తస్తున్నారు.

వి.హైమ, వీహెచ్‌ఏ, రామభద్రపురం

ప్రకృతిసాగుతో ఆరోగ్యం



ప్రకృతి సాగు పద్ధతిలో కూరగాయలు

- ఈ ఖరీఫ్ లక్ష్యం వేల 58,882 ఎకరాలు
- ప్రకృతి సాగు చేసే రైతులు 58,279 వేల మంది



ప్రకృతి సాగు చేయడానికి రైతులకు సిద్ధం చేసిన నువ్వు విత్తనాలు

విజయనగరం ఫోర్ట్: ప్రస్తుత కాలంలో వయసుతో సంబంధం లేకుండా వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. గతంలో 50 ఏళ్లు దాటిన వారికి బీపీ, షుగర్ వంటి వ్యాధులు వచ్చేవి. ఇప్పుడు 20, 30 ఏళ్లకే ఈ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. మానవుని ఆహారపు అలవాట్లలో మార్పు రావడంతో పాటు పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగం కారణంగా తక్కువ వయసులోనే వ్యాధుల బారిన పడుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రకృతి సాగు పద్ధతిలో పంటల సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులకు చెబుతోంది. అందుకు అనుగుణంగా అధికారులు కూడా చర్యలు చేపడుతున్నారు. రసాయన ఎరువులతో సాగు చేసే పంటల ఆహారాన్ని తినడం వల్ల అనారోగ్య సమస్యలు రావడంతో పాటు చీడ, పీడల బెడద కూడా ఉంటుంది. ప్రకృతిసాగు పద్ధతిలో అయితే చీడపీడల బెడద పెద్దగా ఉండదు. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న, పెసర, మినుము, కూరగాయలు, పండ్ల తోటలు ప్రకృతి సాగు పద్ధతిలో చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఆచరిస్తున్న రైతులు

2016లో ప్రకృతి వ్యవసాయ విభాగం ఏర్పాటైనప్పుడు ప్రకృతి సాగు పద్ధతులను కేవలం 10 మండలాల్లో మాత్రమే రైతులు పాటించేవారు. ప్రస్తుతం ఉమ్మడి విజయనగరం జిల్లాలోని అన్ని మండలాల్లో రైతులు పాటిస్తున్నారు. సమాజంలో కొత్త, కొత్త రోగాలు వ్యాప్తి చెందుతుండడంతో ప్రజలు కూడా ఆరోగ్యపై శ్రద్ధ వహిస్తున్నారు.

8 ఏళ్లలో గణనీయంగా పెరిగిన ప్రకృతి సాగు

ప్రకృతి సాగు పద్ధతిని రైతులు గతంలో పెద్దగా ఆచరించేవారు కాదు. అయినప్పటికీ కొన్నేళ్లుగా ప్రకృతి సాగు పెరుగుతూ వస్తోంది. గడిచిన 8 ఏళ్ల కాలంలో గణనీయంగా ప్రకృతి సాగు పెరిగింది. 2016లో 1368 హెక్టార్లలో రైతులు సాగు చేశారు. ఈ ఏడాదిఖరీఫ్‌లో 58,882 ఎకరాల్లో సాగు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు ప్రకృతి సాగులో భాగంగా వరి పంట 32,461 ఎకరాల్లో, మొక్కజొన్న పంట 3434, నువ్వు పంట 17,326 ఎకరాల్లో, పండ్ల తోటలు 5661 ఎకరాల్లో రైతులు సాగు చేయనున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి

పాలకొండ రూరల్: ప్రస్తుత వేసవి చివరలో కురిసే అడపా దడపా వర్షాల కారణంగా గొర్రెల్లో వచ్చిన సీజనల్, సాధారణ వ్యాధులు వాటి నివారణ చర్యలపై పాడిరైతు లు, పెంపకందారులు అవగాహన పెంచుకోవాలని పశు సంవర్థకశాఖ సహాయ సంచాలకుడు (ఎ.డి) ప్రభా మాణిక్యరావు అన్నారు. లేని పక్షంలో జీవాలు మృత్యువాత పడే అవకాశం ఉందన్నారు. వివిధ రకాల క్రిమి, కీటకాల వల్ల వ్యాధులు సంక్రమిస్తా యని తెలిపారు. గొర్రెల పెంపకందారులు సరైన సమయంలో సమస్యలు గుర్తించి, వైద్యుల సూచన లు పాటించాలన్నారు. ఈ మేరకు సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

సూక్ష్మజీవుల ద్వారా...

సూక్ష్మజీవుల వల్ల చిటుకు వ్యాధి(ఈటీ), అంత్రాక్స్ లేదా నల్లజాడ్యం, ఊపరితిత్తుల్లో నెమ్ము లేదా నెమోనియా, పొగాళ్లు లేదా బురద పుండ్లు, మితువకాళ్లు, గొంతువాపు వ్యాధుల సంభవిస్తాయి. గాలికుంటు, నీలి నాలిక, బొబ్బరోగం, అమ్మతల్లి, నోటి పుండ్లు వంటివి వైరస్ ద్వారా ఒకదాని నుంచి ఇంకొకదానికి చేరి మందకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. తేలికపాటి వర్షాలు కురిసేటప్పుడు క్లాస్ట్రీడియం జాతి సూక్ష్మజీవుల వల్ల ఎక్కువ ప్రమాదం



చోటు చేసుకుంటుంది. బలిష్టంగా, ఆరోగ్యంగా ఉండే గొర్రెలు ఒక్కసారిగా ఎగిరిపడి కొట్టుకుని మరణించడం.. కడుపును కాళ్లతో తన్నడం.. కడుపు ఉబ్బడం.. నల్లగా దుర్వాసన వచ్చే పారుడు.. నోటి నుంచి నురగ రావడం.. ఫిట్స్ వంటి లక్షణాల ద్వారా ఈ రోగాలను గుర్తించవచ్చు. ఈ సమస్యలకు చికిత్స అందించే క్రమంలో వైద్యుల సలహా మేరకు రోగ పరిస్థితిని బట్టి ఆక్సిట్రెట్ సైక్లిన్ మందును 5 నుంచి 10 మిల్లీగ్రాములు ఒక కిలో బరువుకు లెక్కకట్టి గొర్రెలకు అందించాలి. 50 మిల్లీగ్రాముల పొటాషియం పర్మాంగనేట్ 100 ఎం.ఎల్ నీటిలో కలిపి తాగించాలి. రోగనివారణకు అవసరమగు టీకాలు కూడా అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ పశువైద్య కేంద్రాల్లో ఈ టీకాలను ఉచితంగా అందిస్తారు. మూడు మాసాల వయస్సు నిండిన గొర్రెపిల్లలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందు ఇవ్వాలని, మొదటి టీకా ఇచ్చిన 15 రోజుల తర్వాత బూస్టర్‌డోస్ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతి ఏటా మే నెల మొదటి వారంలో క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ రచయితలు శ్రీరామ చక్రధర్, శారద దీప్తి శిక్షణ కార్యక్రమానికి హాజరైన చిన్నారులు, పెద్దలకు వ్యక్తిత్వ వికాస సూత్రాలను వివరించారు. మనిషి ఉన్నత స్థాయికి ఎదగడానికి అవసరమయ్యే వ్యక్తిత్వం, గుణగణాలను వివరించారు. శిక్షణ శిబిరానికి 200 మంది హాజరు కాగా ఆలయ అర్చకులు చాణక్య, హర్షలు శాంతి మంత్రాలు, ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, చీఫ్ ఆడిటర్ బాలాజీ, ఉమాదేవి దంపతులు, జాహ్నవి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలో చోరీ

మక్కువ: మండలంలోని కాశీపట్నం పంచాయతీలో గల రైతుభరోసా కేంద్రంలో జరిగిన చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు ఎస్సై పి.నరసింహమూర్తి బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాశీపట్నం గ్రామంలో ఆర్‌అండ్‌బీ రహదారి సమీపంలోని ఆర్‌బీకేలో విధులు నిర్వహిస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ గొట్టాపు సతీష్‌కుమార్ ఈనెల 10వతేదీన విధులు నిర్వహించి, రైతుభరోసా కేంద్రం తలుపులకు తాళాలు వేసి వెళ్లిపోయారు. మళ్లీ ఈనెల 14వతేదీన ఆర్‌బీకేలో విధులు నిర్వహించేందుకు వచ్చిన ఆయన తలుపులు తీసి, చూడగా టీవీ, కంప్యూటర్ మానిటర్, ప్రింటర్‌ను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. దీంతో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సతీష్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గిరిశిఖర గ్రామాల్లో దోమల నివారణ చర్యలు



స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న డీఎంఓ జగన్మోహనరావు

గుమ్మలక్ష్మీపురం: గిరిశిఖర గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. గుమ్మలక్ష్మీపురం మండలంలోని కీసరి, కీసరి గూడలలో దోమల నివారణ మందు పిచికారీని జిల్లా మలేరియా నివారణ అధికారి (డీఎంఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు పరిశీలించారు. గ్రామంలో ప్రతీ ఇంటిలోనూ దోమల నివారణ మందును సక్రమంగా పిచికారీ చేస్తున్నది, లేనిదీ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. దోమల సంహారిణి ఏసీఎమ్5% రసాయనం కలిపే మోతాదు, స్ప్రే చేసిన గదులను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. స్ప్రేయింగ్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. దోమతెరల వినియోగంపై అక్కడి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో జ్వర లక్షణాలతో ఎవరైనా ఉన్నారా అన్న విషయంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఎంఓ డి.సూర్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి మోహనరావు, పంచాయతీ కార్యదర్శి పి.లక్ష్మి, మలేరియా సాంకేతిక సూపర్‌వైజర్ అప్పలనాయుడు, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ రాధా కృష్ణ, ఏఎస్ఎం ప్రభావతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ భద్రత పరిశీలన

పార్వతీపురం: ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లకు కల్పించిన మూడంచెల భద్రత, బందోబస్తును పరిశీలించారు. మొదటి స్థాయిలో స్థానిక పోలీసులు, రెండవ స్థాయిలో రాష్ట్ర సాయుధ బలగాలు, మూడవ స్థాయిలో కేంద్ర సాయుధ బలగాల పహారా ఏర్పాటు చేశారు. రేయింబవళ్లు పహారాతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అప్రమత్తంగా ఉండాలని భద్రతా అధికారులకు ఎస్పీ సూచించారు. భద్రతా ఏర్పాట్ల తనిఖీ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, అరకు పార్లమెంటరీ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్.ఎస్.శోబిక, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సాలూరు శాసన సభ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి సి.విష్ణుచరణ్, అదనపు ఎస్పీ డా.ఓ.దిలీప్ కిరణ్, అధికారులు పాల్గొన్నారు.

సీతంపేటలో భారీ వర్షం



కురుస్తున్న వర్షం

సీతంపేట: మండల కేంద్రం సీతంపేటలో బుధవారం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అత్యధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిన ప్రజలకు ఈ వర్షం ఊరటనిచ్చింది. జీడిమామిడి తోటలకు ఈ వర్షం వల్ల నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొనసాగుతున్న వర్షాలు

భామిని: మండలంలో రెండురోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వాతావరణం చల్లబడింది. రోడ్లు గోతులు, వంతెనలలో వర్షపు నీరు చేరుతుండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట పోలాల్లోకి వర్షపు నీరు చేరుతుండండంతో కూరగాయల పంటల రైతులకు ఊరట కలిగిస్తోంది.